

జిల్లా గిరిజన సహకార సంస్థ కార్యాలయం


అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్న గిరిజన మహిళ (ఫైల్)

- ఇప్పటికీ గిట్టుబాటు ధరలు కల్పించని కార్పొరేషన్
- ఉపాధి కోల్పోతున్న గిరిజనులు
- ఇకనైనా స్పందించాలని వేడుకోలు

# కొనుగోళ్లపై జీసీసీ నిర్లక్ష్యం

## అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆసక్తి చూపని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : జిల్లా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నిర్లక్ష్యం.. గిరిజనులకు శాపంగా మారుతున్నది. రాత్రనకా.. పగలనకా.. అష్టకష్టాలు పడి సేకరించే అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లపై ఆసక్తి చూపకపోవడతో వారు ఉపాధిని కోల్పోయే పరిస్థితి దాపురిస్తున్నది. గతేడాది అరకొరగా కొనుగోళ్లు చేపట్టగా, ఈ యేడాది అసలు ఆ ఊసే ఎత్తడం లేదంటూ అడవిబిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఇందులో 13.. గిరిజన మండలాలే ఉండడం గమనార్హం. వర్షాకాలంలో వ్యవసాయం చేసుకునే గిరిజనులు.. వేసవి(మార్చి, ఏప్రిల్, మే)లో మాత్రం అటవీ ఉత్పత్తులపైనే ఎక్కువగా ఆధారపడి జీవిస్తుంటారు. ఇప్పపూలు, ఇప్పపరక, చిల్లగింజలు, తేనె, జిరుగు, మైనం వంటివి సేకరించి జిల్లా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డీఆర్ డిపోల్లో అమ్ముకొని ఆర్థిక అవసరాలు వెళ్లదీసుకుంటారు.

### పట్టించుకోని జీసీసీ

అడవుల్లో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తుల సేకరణను ప్రోత్సహిస్తూ.. వాటిని కొనుగోలు చేయాల్సిన జీసీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. యేటా ఫిబ్రవరిలో అటవీ ఉత్పత్తుల ధరలను నిర్ణయించాల్సి ఉండగా, ఈసారి అసలు పట్టించుకోవడం లేదు. అధికారులు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేవిధంగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అత్యధిక గిరిజన గ్రామాలున్న జిల్లాను అటవీ ఉత్పత్తుల సేకరణలో ముందంజలో ఉండాల్సి ఉండగా, వారి అలసత్వంతో లక్ష్యం నెరవేరడం లేదు.

### గిట్టుబాటు కల్పించని అధికారులు

అడవుల్లో ప్రాణాలకు తెగించి గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు అధికారులు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమవుతున్నారు. నామమాత్రంగా ధర చెల్లిస్తున్నారు. తేనె ధర మార్కెట్‌లో కిలోకు రూ. 500 నుంచి రూ. 600 వరకు పలుకుతుంటే.. జీసీసీ అధికారులు మాత్రం కిలోకు రూ. 150 చొప్పున ధర నిర్ణయిస్తున్నారు. ఇప్పపూలకు వ్యాపారుల వద్ద కిలోకు రూ. 40 ఉంటే.. జీసీసీలో మాత్రం రూ. 20 కిలో ధర ఉంటోంది. ఇలా అన్ని అటవీ ఉత్పత్తులపై అధికారులు మార్కెట్ రేటులో సగం కూడా చెల్లించడం లేదు.. కష్టపడి సేకరించిన ఉత్పత్తులకు గిట్టుబాట ధర చెల్లించకపోవడంతో గిరిజనులు.. వాటిని సేకరించేందుకు కూడా ఆసక్తి చూపడం లేదని తెలుస్తున్నది. గిరిజనులు సేకరించే ఇప్పపూలను బహిరంగా మార్కెట్‌లో నేరుగా అమ్ముకునే వీలుండదు.. జీసీసీ ఏర్పాటు చేసిన డీఆర్ డిపోల్లోనే అమ్మాల్సి ఉంటుంది. అధికారుల నిర్లక్ష్యంతో ఉపాధి కోల్పోయే అవకాశముందని, ఇకనైనా స్పందించి జీసీసీ ద్వారా ప్రత్యేక మద్దతు ధర కల్పించి అటవీ ఉత్పత్తుల సేకరణను ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.


కన్నెపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# శంకుస్థాపన చేసిన చోటే పీహెచ్‌సీ నిర్మించాలి

## బీఆర్ఎస్, బీజేపీ నాయకుల రాస్తారోకో

కన్నెపల్లి, ఫిబ్రవరి 9 : కన్నెపల్లి మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మొదట శంకుస్థాపన చేసిన చోటే నిర్మించాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని దారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కన్నెపల్లి మండలానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమీపంలో నిర్మించడానికి ఇటీవల బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారన్నారు. కానీ, ఆ స్థలంలో కాకుండా సబ్‌స్టేషన్ సమీపంలో నిర్మాణం చేపడుతున్నారని, కనీసం నీరు కూడా దొరకని చోట దవాఖాన నిర్మించడమేమిటని వారు మండిపడ్డారు. అక్కడ నిర్మిస్తే ప్రజలు, రోగులు ఇబ్బంది పడాల్సి వస్తుందని, మొదట అనుకున్న స్థలంలోనే దవాఖాన నిర్మించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి, గణేశ్, బీజేపీ నాయకులు పుల్లూరి రాజయ్య, ఆటో యూనియన్ నాయకుడు అంజయ్య పాల్గొన్నారు.

# తండేల్ సినిమాలో మనోడు


హీరో నాగచైతన్యతో హరీశ్

కన్నెపల్లి, ఫిబ్రవరి 9 : నాగచైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమాలో కన్నెపల్లి మండలం ముత్తాపూర్ గ్రామానికి చెందిన యువకుడు దేవునూరి హరీశ్ నటించాడు. చిన్నతనం నుంచి నటనపై ఉన్న ఆసక్తితో డాన్స్, నాటికలు వేసి ప్రశంసలు అందుకున్నాడు. అనంతరం ఈటీవీలో ప్రసారమయ్యే ఢీ జోడీలో డ్యాన్సర్‌గా అలరించాడు. హైదరాబాద్‌లో ఉంటూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేశాడు. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య-సాయి పల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన తండే ల్ సినిమాలో విలన్ టీంలు సైడ్ క్యారెక్టర్‌గా నటించాడు. తనకు అవకాశమిచ్చిన దర్శక, నిర్మాతలకు హరీశ్ కృతజ్ఞలు తెలిపారు.


ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

# దడపుట్టిస్తున్న డయేరియా

## చెన్నూర్‌లో విజృంభిస్తున్న అతిసార

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- వారంలో 93 మందికి అస్వస్థత
- తాగునీటి శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపిన అధికారులు
- అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్న వైద్యారోగ్యశాఖ

మంచిర్యాల, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో డయేరియా విజృంభిస్తూ దడ పుట్టిస్తున్నది. రోజు రోజుకూ కేసులు పెరుగుతుండగా, ఒక్క వారంలోనే 93 మంది అస్వస్థతకు గురికావడం తీవ్ర చర్చనీయాంశమవుతున్నది. ఈ నెల 1న చెన్నూర్ పట్టణంలోని బట్టిగూడెం, ఎమ్మెల్యే కాలనీకి చెందిన 8 మంది, 2వ తేదీన మరో 8 మంది, 3న ఏకంగా 15 మంది, 4న 8 మంది, 5న 19 మంది, 6న 12 మంది, 7న 13 మంది, 8న తొమ్మిది మంది, 9న ఒకరు డయేరియాతో హాస్పిటల్‌లో చేరడం ఆందోళనకు గురిచేస్తున్నది.

### తాగునీటి నమూనాల సేకరణ..

### అంతుచిక్కని కారణం..

చెన్నూర్ పట్టణానికి సరఫరా చేసే తాగునీరు కలుషితమవడంతోనే డయేరియా వచ్చిందని స్థానికులు అంటున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల వాసులు బతుకమ్మ వాగు నీరు తాగుతున్నారు. వాగు నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ కొలాయిల నీటినే తాగేందుకు ఉపయోగిస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా ఈ నీటిపైనే చెన్నూర్ పట్టణం ఆధారపడి ఉంది. బతుకమ్మ వాగు సంప్‌హౌస్ దగ్గర ఫిల్టర్ బెడ్ లేకపోవడంతోనే నీరు కలుషితమై పట్టణవాసులకు డయేరియా వచ్చిందనే చర్చ పట్టణంలో జోరుగా సాగుతున్నది. దీంతో నాలుగు రోజుల క్రితమే వాగు నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. సంప్‌ను శుభ్రం చేసి, క్లోరినేషన్ సైతం చేశారు. నాలుగు రోజులుగా బతుకమ్మ వాగు నుంచి నీటి సరఫరా ఆపేసినప్పటికీ, డయేరియా కేసులు తగ్గుముఖం పట్టడం లేదు. బట్టిగూడెం, ఎమ్మెల్యే కాలనీ నుంచి జెండావాడ, బలిజవాడ, లైన్‌గడ్డ, సౌన్నాయిల వీధి, శివాలయం వీధితో పాటు తదితర ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయి. దీంతో డయేరియా ప్రబలడానికి కారణాలేమిటి అన్నది అంతుచిక్కకుండా పోయింది. దీంతో అధికారులు బతుకమ్మ వాగు నీటి నమూనాలు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. దీనికితోడు పట్టణంలోని పలు ప్రాంతాలకు నీరు సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు, పట్టణ కేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి సైతం నీటి నమూనాలు తీసి వరంగల్‌లోని ల్యాబ్‌కు పంపించాలని నిర్ణయించారు. ఆ రిపోర్ట్‌లు వస్తేనే తాగునీటి కాలుష్యంపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు.

### వైద్య శిబిరాలు..

డయేరియా ప్రబలిన బట్టిగూడెం, ఎమ్మెల్యే కాలనీలో పాటు పలు ప్రాంతాల్లో వైద్యాధికారులు ఇప్పటికే వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి డయేరియాతో బాధపడుతున్న వారి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. డయేరియా లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. డయేరియాపై స్థానిక వైద్యాధికారులు, మున్సిపాలిటీ అధికారులతో జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూర్ పట్టణంలో ప్రబలుతున్న డయేరియాను అదుపులోకి తీసుకురావడానికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే బతుకమ్మ వాగు, మిషన్ భగీరథ నీటి నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపించామన్నారు. ఫలితాలు రావాల్సి ఉందని, అవి వస్తే ఓ స్పష్టత వస్తుందన్నారు. పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచి సైతం నమూనాలు తీసి పంపాలని మున్సిపాలిటీ అధికారులను కోరామన్నారు. డయేరియాకు చెన్నూర్ ప్రభుత్వ దవాఖానాలో అన్నిరకాల సౌకర్యాలు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు.

### బతుకమ్మ వాగు నీటినే తాగేవాళ్లం



నాకు బుద్ధి తెలిసనప్పటి నుంచి మేము బతుకమ్మ వాగు నీటినే తాగుతున్నాం. నాకు మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. మొదట మామూలుగా ఉన్న.. క్రమంగా అధికమై పూర్తిగా నీరసించి పోయిన. చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చాను. మూడు రోజుల నుంచి ఇక్కడే చికిత్స పొందుతున్నా. కొంత మేర కోలుకున్నా. ప్రభుత్వం పట్టణ ప్రజలకు శుద్ధజలం అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

**- పాయికరావు రమేశ్, బలిజవాడ, చెన్నూర్**

### నేను, నా బిడ్డ అవస్థ పడుతున్నాం..



నాకు, నా నాలుగేళ్ల కూతురు శివాగ్నికి వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నాం. మా కాలనీలో కొందరు ఇలానే ఇబ్బంది పడుతూ దవాఖానకు వెళ్లారు. మూడు రోజుల క్రితం అధికారులు వచ్చి బతుకమ్మ వాగు నీటిని తాగొద్దని చెప్పారు. నీటి సరఫరాను సైతం బంద్ చేశారు. అప్పటి నుంచి బోరు నీటిని తాగుతున్నాం. ఆ నీరు తాగినప్పటికీ నాకు, నా బిడ్డకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయి. చికిత్స కోసం దవాఖానాకు వచ్చాము. ఈ సమస్య ఎందుకు వచ్చిందో అధికారులు సాధ్యమైనంత తొందరగా చెప్పాలని కోరుతున్నాం.

**- పల్లికొండ మాధవి, ఎమ్మెల్యే కాలనీ, చెన్నూర్**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

# నలభై వేల ఉద్యోగాలు ఏమయ్యాయి?

- కోతుల సమస్యపై నిలదీస్తే రూ.2 లక్షలిస్తానని మోసం చేసినవ్
- ఎమ్మెల్యే వివేక్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్

భీమారం, ఫిబ్రవరి 9 : 'శాసన సభ ఎన్నికల సమయంలో జైపూర్ ఎస్టీపీపీలో 40 వేల మందికి ఉద్యోగాలు పెట్టిస్తా అంటివి. ఇప్పుడు ఏమైంది. గద్దెనెక్కిన తర్వాత ఆ ఊసెత్తడం లేదు. మాయమాటలు చెప్పి నియోజకవర్గ ప్రజలను మోసం చేసినవ్' అంటూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఎమ్మెల్యే వివేక్‌పై ఫైర్ అయ్యారు. ఆదివారం భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లతో పాటు డైరీలను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వివేక్ భీమారానికి, నియోజక వర్గానికి ఏం చేశాడని ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారని ప్రశ్నించారు. భీమారంలో 138 సర్వే నంబర్‌లో క్రీడా మైదానం పేరిట నీ కార్యకర్తలు మొరం అమ్మారని, ఇప్పుడు ఆ మైదానాన్ని చూడడానికి ఎలా వస్తావని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో శ్రీకాంతాచారి క్రీడా మైదానానికి భూమి కేటాయిస్తే, కనీసం దాని అభివృద్ధికి రూపాయి కూడా ఇచ్చింది లేదన్నారు. కోతుల నివారణకు భీమారం ప్రజలు రూ. 3 లక్షలు జమ చేసి ఇచ్చారని, ఆ సమస్యపై నిలదీస్తే రూ. 2 లక్షలు ఇస్తానని చెప్పి.. ఒక్క రూపాయి ఇవ్వకుండా ప్రజలను మోసం చేశావని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, నాయకులు వేముల ప్రణీత్ గౌడ్, చింతల తిరుపతి, గుడిమల్ల నరహరి, దుర్గం రమేశ్, డోంగ్రి రాజలింగు, వడ్ల కొండ పవన్, బబ్లు, సోదారి మల్లేశ్, రాజన్న, యువ నాయకులు దాసరి మణిదీపక్ పాల్గొన్నారు.

# వైభవంగా సత్యదేవుని కల్యాణం

## దర్శించుకున్న ఎమ్మెల్యే పీఎస్సార్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


సత్యదేవుని కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు


కల్యాణాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, ఫిబ్రవరి 9 : మండలంలోని గూడెం గుట్టపై ఆదివారం రాత్రి సత్యదేవుని కల్యాణం వైభవంగా జరిగింది. గోధూళిక సుముహూర్తమున సత్యనారాయణస్వామి-రమాదేవిల కల్యాణాన్ని వేదపండితులు ఆశేష భక్తజనం మధ్య ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా నుంచేగాక కరీంనగర్, జగిత్యాల, ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు టీటీడీ నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ నాయకులు రఘునాథ్‌రావు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మ న్ దాసరి ప్రేంచంద్, ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధన రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, గోపాల స్వామి, సురేష్ స్వామి, వేదపండితులు నారాయణశర్మ పాల్గొన్నారు.

